



గేటు తోసుకొచ్చి లోపలికి అడుగు పెడుతున్న రాముని చూసి,

“ఏరా! స్కూటర్ ఏమయింది? నువ్వు తీసుకెళ్ళలేదా?” కంగారుగా

అడిగాను.

బాగా అలసిపోయినట్లున్నాడు. ఒళ్ళంతా చెమటలు పట్టినట్లుంది. చొక్కా బాగా తడిపి వుంది.

"మాట్లాడవేంరా? తీసుకెళ్ళావా, లేదా?" ఉరిమాను.

"తీసుకెళ్ళాను నాన్నా!" నెమ్మదిగా నసిగాడు. వాడిగొంతు వణుకుతోంది.

"మరేదిరా? ఎవరికయినా ఫ్రెండ్ కిచ్చావా?" గర్జించాను. ఖర్మ! ఈ స్కూటర్ ఉండటం కాదుగాని దీనిని కాపాడుకోలేక నా ప్రాణం పోతుంది. ప్రొద్దున్నే యూనివర్శిటీకి బస్సులో వెళ్ళటం కష్టమౌతుందని అప్పుచేసి స్కూటర్ కొన్నాను. ఇంకేముంది- 'నాన్న స్కూటర్ కొన్నారు! ఇంకేం-ఎంతో హాయిగా బజార్లు తిరగొచ్చని' మా వాడు హైదరాబాద్ నగరమంతా ఆ బండి వేసుకుని సర్వే చేసేస్తుంటాడు- వీలుదొరికినప్పుడల్లా. ఏం చేస్తాం? కన్నకొడుకు. ఏదో సర్దా పడుతున్నాడు పోనీలే అనుకుంటే రెండుసార్లు మైనర్ రిపేర్లు, మరో మూడుసార్లు మేజర్ రిపేర్లు చేయించి నా అప్పును మరో మూడువేలు పెంచాడు. బంగాళాఖాతంలో పెట్రోలు పడితే తప్ప నా లాంటివారు అసలు స్కూటర్లు కొనుక్కోకూడదనిపిస్తుంటూంది- పెట్రోల్ ధరని చూస్తూంటే. కానీ ఏంచేస్తాం- తప్పదు. అంత దూరం సకాలంలో వెళ్ళాలంటే మరో మార్గంలేదు. అందులో మొదటిక్లాసు నాదే. బస్సులను నమ్ముకుని కూర్చుంటే లంచ్ టైంకి చేరుకుంటే గొప్పే!

"ఎక్కడ తగలెట్టావో చెప్పు!" కోపం తలదాకా వచ్చింది.

"నాన్నా! మ... రే... మో..."

"మా ఫ్రెండ్ అడిగాడు- ఇచ్చానంటావ్. నేను కొన్నది నువ్వూ నీ ఫ్రెండ్స్ షికార్లు కొట్టటానికి కాదు" విరుచుకు పడ్డాను.

"అది కాదు నాన్నా! రాంగ్ సైడ్ వచ్చినందుకు పోలీసు పట్టుకున్నాడు. లైసెన్స్ చూపించమన్నాడు. ఎంత బతిమాలినా వినిపించుకోలేదు. యాభై రూపాయలు ఫైన్ వేశాడు. అది ఇస్తేకాని స్కూటర్ ఇవ్వనన్నాడు......"

బిక్క మొహం వేసుకుని చెప్పుకు పోతున్నాడు పుత్ర రత్నం.

నా కోపం తారాస్థాయినందుకుంది. "పోలీసుస్టేషన్‌లో స్కూటర్ పెట్టి నువ్విలా వచ్చావా? అయినా దాన్ని నువ్వు వాడొద్దురా అంటే వింటావా- చస్తావా! హైదరాబాదులో అసలు నడవాలంటేనే

భయంగా వుంటుంది. అలాంటిది నువ్వు నీయిష్టంవచ్చినట్లు నడిపితే ఏమవుతుంది? నీ పోజ్‌లో నువ్వు నడుపుతుంటావు. నీకు ట్రాఫిక్ రూల్స్ ఎందుకు? అసలు నీకు తెలిసి చస్తేకదా! అయినా నిన్నని ఏం సుఖం! నా ఖర్మ! ఏది వాడు వ్రాసిచ్చిన ఆ బిల్లేది?'' అంటూ మా వాడిదగ్గర్నుంచి తీసుకొని మర్నాడు యూనివర్శిటీ కెళ్ళేటప్పుడు ఆబిడ్స్‌లో బస్సుదిగి స్కూటర్‌ని విడిపించుకొని అక్కడ్నుంచియూని వర్శిటీకి వెళ్ళవచ్చనుకున్నాను.

"ఫో - లోపలికి!" కసురుకున్నాను.

మర్నాడు సోమవారం.

ఇంటినుంచి త్వరగా బయలు దేరి ఆబిడ్స్ పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాను. బయట ఇద్దరు కానిస్టేబుల్స్ బీడీలు కాలుస్తూ హిందీలో ఏదో మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ దగ్గరతో నేను వచ్చినపని చెప్పాను. "అ.... రెండు మూడు స్కూటర్లు లోపలున్నాయిసార్!" హిందీలోనే జవాబు చెప్పారు. "మీరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ని కలవండి" అనికూడా చెప్పారు

టి.ఐ.ని కలుద్దామని లోపలికి వెళ్ళాను.

టి.ఐ సీట్లోనే ఉన్నాడు.

"గుడ్‌మార్నింగ్ ఇన్‌స్పెక్టర్!..

"వెరీ గుడ్‌మార్నింగ్! టేక్ యువర్ సీట్." చదువుతున్న న్యూస్ పేపర్ని పక్కకి తొలగించి కుర్చీ చూపించాడు.

"సార్! మీ.... మీరు.... ఏమిటిలా వచ్చారు?" ఇన్‌స్పెక్టర్ మొఖంలో ఆశ్చర్యం!

"భూపతీ! నువ్విక్కడ...."

"గుర్తుపట్టారా సార్! నేను భూపతిని. ఇక్కడ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ని!" చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

నాతల తిరిగినంత పనయింది. ఈరోజు ఎవరి మొహం చూసానో? ఇక నా స్కూటర్ నా చేతికి వచ్చినట్లే! సుపుత్రా! ఎంత పని చేసావురా? నోటికి ఇష్టం వచ్చి నట్లు నోట్లోనే తిట్టుకున్నాను. వచ్చీ వచ్చీ పులినోట్లో పడినట్లయింది నా పని.

"జస్ట్ వన్ మినిట్. ఇప్పుడే వస్తానుసార్! మీరు కూర్చోండి" భూపతి బయటకి వెళ్ళాడు.

ఎంతపని జరిగింది?

గతం ఒక్కసారి జ్ఞాపకం వచ్చింది.

* * *

ఆరోజు ప్రైవేట్ క్లాసు తీసుకోవటంవలన ఇంటికి బయల్దేరటం

లేటయింది. అవంగానే బయల్దేర టానికి వీల్లేకుండా తెలుగు లెక్చరర్ నారాయణమూర్తి కవి చౌడప్ప నీతి శతకాలు గమ్మత్తుగా చెప్తూ, నా ప్రాణం మరో గంట తో డేపి, జీవాన్ని స్కూటర్ స్టాండ్ దాకా లాక్కొచ్చి, ప్రక్కనే ఉన్న క్యాంటీన్ అనబడే స్వర్గంలో కాఫీ అనే అమృతాన్ని పోయించి, మళ్ళీ జీవాన్ని నా శరీరంలోకి పంపించాడు. ఆ రోజు ఆయన గారికి ప్రొద్దుట్నించి ఎవరూ దొరికినట్లు లేదు- ఓ గంట లేటుగా బయల్దేరిన నేను దొరి కాను.

అంతే! సమాసభూయిష్టమైన తెలుగు వచనావళితో రాత్రి ఏడింటి దాకా నన్ను హూనం హూనం చేసేసాడు. నేనా మ్యాథమెటిక్స్ లెక్చరర్ని. నేను సబ్జెక్ట్ గురించి అతనికి చెప్పేదేముంటుంది? ఒక వేళ ఏమైనా చెప్పినా వినిపించు కునేదేముంటుంది? అయినా నా శార్థం. ఆ సమయంలో ఏం చెప్ప గలను? స్టూడెంట్స్‌కి చెప్పి చెప్పి నోరూ, చేతులూ రెండూ పడి పోయాయి. 'నాయనా..నారాయణా! ఈ పూటకి నీ స్పెషల్ క్లాసు చాలు. వస్తా' నంటూ స్కూటర్ స్టార్ట్ చేసాను.

అప్పటికే యూనివర్శిటీ రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. దార్లో స్ట్రీట్ లైట్స్ కూడా సరిగ్గా లేవు.

అసలు ఆ దారంటే నాకు మహా చెడ్డ చిరాకు. కొద్దిగా చీకటి పడిం దంటే జనసంచారమే ఉండదు. అయినా జనసంచారం ఉండటానికి చుట్టుప్రక్కల ఇళ్ళు ఉంటే కదా- స్టూడెంట్స్ హాస్టలు, కాలేజీలు తప్పిస్తే.

దయ్యాలు విరబోసుకున్న జడల్లా దారంతా చెట్లు. చీకటి ఇంకా చిక్కపడుతోంది.

దూరంలో దారికి అడ్డంగా ఓ మోటార్ సైకిలు.

హారన్ కొడుతూనే ఉన్నాను.

కాని దాన్ని ఎవరూ తొలగించ టం లేదు.

ప్రక్కనుంచి పోవచ్చులే అను కుంటూ ఎందుకైనా మంచిదని హారన్ కొడుతూనే ఉన్నాను.

నా స్కూటర్ మోటార్ సైకిల్ని చేరుకుంది.

కాస్త స్లోచేసి నడుపుతున్నాను.

"ఆగుసార్!" చిన్న సైజు కేకలాంటిది వినిపించింది.

'ఎవరబ్బా?' అనుకుంటూ నెమ్మదిగా బండిని ఆపాను. ఎవరైనా స్టూడెంట్స్ అక్కడ

ఉన్నారేమో, కనీసం ఈ రోడ్డు మీదనుంచి బయటపడే దాకానైనా కాస్త కంపెనీ లభిస్తుందనుకున్నాను.

చిరువెలుగులోంచి ఓ మనిషి నావైపు వచ్చాడు. అతన్నిఎక్కడా చూసినట్లు గుర్తులేదు.

"ఏం సార్! ఇంటికేనా?"

అతని ముఖం స్పష్టంగా కనిపిస్తోంది. అతను అంత పరిచయస్థుడిగా పలకరించటం నాకు ఆశ్చర్యం వేసింది.

"మీరెవరు? మీ పేరు...."

కుతూహలంగా అడిగాను.

"అరె! మర్చిపోయారా నన్ను? నేను భూపతినిసార్! గుర్తు పట్టలేదా?" నవ్వుతూ అదో విధంగా ప్రశ్నించాడు.

భూపతి....నా స్టూడెంట్స్‌ని ఒక్కసారి గుర్తుకు చేసుకున్నాను.

"పోన్లే సార్! గుర్తుకి రావటం కష్టమైతే నేనే గుర్తు చేస్తాను."

"సరే పదండి! వెళ్తూ మాట్లాడుకుందాం" అంటూ గేరు మార్చాను.

"వద్దుసార్! మీతో ఇక్కడే మాట్లాడాలి. అం-మర్చాను. నేనెవరో మీకు గుర్తు చెయ్యాలి కదూ?"

"ఇది సెవెన్‌టీనైన్ కదు సార్?"

అర్థం పర్థం లేని అతని వైఖరి నాకు బోధపడలేదు. విసుగ్గా అతనివంక చూసాను.

"సెవన్‌టీఫైవ్‌లో నేను బి.ఎస్‌సి.ఫైనల్ ఇయర్ రాసాను. మీకు గుర్తుందా?"

'ఇతను రాస్తే నాకేంటి గుర్తు? ఎవర్ననుకుని ఎవరితో మాట్లాడుతున్నాడో?' చిరాకు హెచ్చిపోతోంది.

దూరంనుంచి ఆర్.టి.సి. బస్సు వస్తోంది.

ఇద్దరం దారికి అడ్డం తొలిగాం.

"నా ఆప్షనల్ యం.పి.సి. ఆరోజు మ్యాథమెటిక్స్ చివరి పేపర్. దానికి ఇన్విజిలేటర్ ఎవరో గుర్తుందా సార్?"

చటుక్కున నాకేదో గుర్తు కొచ్చింది. తల పైకెత్తి అతన్నే చూసాను. సందేహంలేదు! అవును భూపతే! అదే అన్నాను- "నువ్వు భూపతివి కదూ?"

"థాంక్స్- గుర్తు తెచ్చుకున్నందుకు!" కసిగా ఉంది అతని గొంతు.

"ఆరోజు నువ్వు కాపీయింగ్ చేస్తుంటే నేను పట్టుకున్నాను. నాతో చాలా దెబ్బలాడావు. అయినా నేను ఏమాత్రం లొంగక నీ ఎక్జామ్‌ని డిబార్ చేసాను!" గర్వంగా చెప్పుకున్నాను.

నా కళ్ళు తిరిగినట్లయింది.

అతని కుడిచేతివేలు ఉంగరం నా ముఖాన్ని ముద్దు పెట్టుకుంది.

అది ఇనుపఉంగరం కాబోలు- నాకళ్ళు బైర్లు కమ్మాయి.

"మీరు గొప్పగా చెప్పుకుంటున్నారు సార్ ఆ విషయాన్ని! నన్ను మీరు మర్చిపోయుండచ్చు. కానీ నేను ఆ రోజుని, మిమ్మల్ని ఎప్పటికీ మర్చి పోలేను- మరిచి పోను. ఆరోజు మీరు నన్ను వదిలేస్తే ఈపాటికి నేను మంచి పొజిషన్లో ఉండేవాణ్ని. మళ్ళీ రెండేళ్ళదాకా పరీక్షలు రాయటానికి వీలులేకుండా చేసారు. నా భవిష్యత్తుని పాడుచేసారు." భూపతి కంఠం చించుకుంటున్నాడు.

విషయం అర్థమైంది. నాలో ఏదో పట్టుదల ఆవేశించింది.

"భూపతీ! నువ్వు చాలా పొరబడుతున్నావు. నా స్థానంలో అప్పట్లో నువ్వున్నా అలాగే చేసేవాడివి. నేను అప్పుడు ఇన్విజిలేటర్ని. ఎవరైనా కాపీ చేస్తూంటే పట్టుకోవటం నా డ్యూటీలో ఒకటి. నన్ను చూసీకూడా, నువ్వు లెక్కపెట్టకుండా, నేను నిన్ను అబ్జర్వ్ చేస్తున్నానని తెలుసుకునికూడా లక్ష్యపెట్టకుండా, ఓపెన్‌గా టెక్స్ట్ బుక్, గైడ్ తీసుకుని ప్రాబ్లమ్ను రిఫర్ చేస్తున్నావు. చూసీ చూడకుండా వదిలేద్దామనుకున్నాను. నా ఓర్పుని నువ్వు నా బలహీనతగా తీసుకొని మరో రెండు బుక్స్ బయటకి తీసావు. ఆ సమయంలో ఎవరైనా ఇంకేం చేస్తారు? జరిగినది తెలిసిందే కదా!"

రెండు పిడిగుద్దులు మళ్ళీ నా మొహాన చోటు చేసుకున్నాయి.

"మాస్టారు! మీరేదో ఘన కార్యం సాధించినట్లు చెప్పుకుపోతున్నారు. నేను ఎలా రాస్తే మీకేం? మీకేమైనా నష్టం కలిగిందా? ఆ రోజు అందర్లో నన్ను అవమానం చేసి నా ఆన్సర్ షీట్ మీద అడ్డమైన గీతలు గీసి, నన్ను బలవంతంగా బయటకి పంపించారు."

ముఖం ఎక్కడో చిట్లినట్లుంది. చేతికి రక్తం చల్లగా ఆ చలిలో మంచులా తాకింది.

"భూపతీ! అయితే నేను చేసింది తప్పంటావు. నా వృత్తి ధర్మాన్ని నేను నిర్వర్తించటం తప్పంటావు." నా కంఠం వణుకుతోంది.

"వృత్తి- ధర్మం!" రాక్షసుడిలా నవ్వాడు భూపతి. "సార్! నేను కాపీ చేసింది నిజమే! కాని అందరు ఇన్విజిలేటర్లు మీలా

చేయలేదే! నా పేపర్ తీసుకుని మీరు అడ్డమైన గీతలూ గీసారే! దానివలన మీకు ప్రొఫెసర్ పోస్టుకి ప్రమోట్ చేసారా? లేకపోతే రెండు ఇంక్రిమెంట్స్ పెంచారా?"

"అయితే అవి రావాలంటే నేనా నేను స్ట్రిక్ట్‌గా ఉండాల్సింది?"

"అందరూ అన్ని పనులు సవ్యంగాచేస్తే ఈ దేశం ఎప్పుడో బాగు పడేది. నేను పట్టుబడ్డానని భయపడ్డాను. మీరు నన్ను డిబార్ చేయడానికి వీలుకలిగింది. కాని ఆ రోజు నాలానే చాలా మంది చేశారు."

"దానికి బాధ్యుడిని నేనుకాను. నేను చూసింది నిన్ను!"

"హుం- మీ వృత్తిధర్మం వాళ్ళనెందుకు చూడలేకపోయింది?"

"భూపతీ! నాకు నీమీద ద్వేషమా? తెలీనివి ఎన్నో జరుగుతుంటాయి. అలా అని తెలుసుకున్న వాటిని కూడా తెలియనట్లుండగలమా?"

"అంతేకాని నీ తప్పు ఒప్పుకోవుకదా!" అతని ఏకవచన ప్రయోగానికి నేనేం జవాబు చెప్పలేకపోయాను.

నాలో ఏదో మొండి పట్టుదల ఆవేశించింది. అతన్ని ఎలాగయినా ఒప్పించాలని ఓపిగ్గా, "చూడు భూపతి! నీకునేను చేసింది తప్పుగానే అనిపిస్తుంది. కానీ ఒకటి గుర్తుంచుకో! ఎవరి ఉద్యోగధర్మం వారు విధిగా పాటించాలి. ఎక్కడో ఎవరో కర్తవ్యాన్ని విస్మరించారని అందరూ నీలానే వుంటే అది అధర్మం. పైగా అంతకుముందే బహుశా నా గురించి నీకు తెలిసే వుండాలి-నేను స్ట్రిక్ట్‌గావుంటానని. అయినప్పటికీ నేనేం చేస్తానులే అన్నట్లు చాలెంజ్‌గా నా ముందు బహిరంగంగా కాపీయింగ్ చేస్తున్నావు. నన్ను రెచ్చగొట్టావు. ఫలితం అనుభవించు..."

నా చెంప పగిలింది.

"భూ..ప..తి..."

నా కళ్ళు చింతనిప్పులు కురుస్తున్నాయ్.

ఎప్పుడో నాలుగేళ్ళక్రితం జరిగినదానికి ఇంత గుర్తుపెట్టుకుని భూపతి ఇలా చేస్తున్నాడంటే బాధ కూడా కలిగింది.

భూపతి ఏమనుకున్నాడో ఏమో దూరంలో వస్తున్న వాహనాల శబ్దానికి తన మోటార్‌సైకిల్ స్టార్ట్ చేసి, "వస్తా" అని వెళ్ళిపోయాడు. దూరంనుంచి- "మళ్ళీ కలుస్తా" అన్నమాట నాకు స్పష్టంగా విన్పించింది.

భూపతే! ఆ రోజు మళ్ళీ

కలుస్తా అన్నాడు. అతను కలవకుండా నేనే అతడ్ని ఈరోజు కలిశాను మనసులో అనుకున్నాను.

హుం! 'విధి' అంటే ఇంతేనేమో?

"సారీసార్! లేటయింది. ఏం సార్? మీరింకా లెక్చరర్‌గానే వున్నారా?" చనువుగా పలకరించాడు.

ఉలికిపాటుతో కళ్ళుపైకెత్తాను.

"ఆఁ! అలావుంచు."

కాఫీ కప్పు నా ముందుంచాడు ఓ బీట్ కానిస్టేబుల్.

ఆశ్చర్యంగా భూపతినిచూశాను.

"తీసుకోండిసార్!"

మెత్తని కత్తితో మెడకోసేట్లున్నాడు తప్పదు.

"ఆఁ! ఇప్పుడు చెప్పండి సార్ మీరొచ్చినపని?" ఇద్దరం ఖాళీ కప్పులని టేబుల్ మీద పెట్టాం.

జరిగింది చెప్పాను.

"అయితే 4231 నెంబర్ బండి మీదేనన్నమాట!"

అసలు భూపతి కావాలని చేసి వుండొచ్చు. ఆ రోజు నాస్కూటర్ నెంబర్ గుర్తుంచుకుని ఇలా చేసి వుండొచ్చు. కుర్రకారు మా వాడికేం తెలిసుంటుంది! కథ. లేటుగా అయినా నిజం తెలుసుకున్నాను.

"మీ అబ్బాయి దగ్గిర డ్రైవింగ్ లైసెన్స్ లేదుట. రాంగ్ సైడ్‌నుంచి పోనిచ్చాడుట. అది అఫెన్స్ అవుతుంది కదా?"

భూపతి నాకు న్యాయశాస్త్రం నేర్పుతున్నాడు. నిర్జీవంగా లోపలే నవ్వుకున్నాను.

నాలో సహనం చచ్చింది.

"భూపతీ! నేనెంత 'పే' చెయ్యాలో చెప్తే...."

"నా ఉద్దేశ్యం అదికాదు సార్! మీరు నాగురించి పొరబడుతున్నారు. నన్ను మీరు క్షమించాలి!" భూపతి గొంతు బొంగురుమంది.

"భూపతీ! ఏమిటి నువ్వంటున్నది?" నన్ను నేను నమ్మలేకపోయాను. "అవును సార్! మీరు నన్ను క్షమించానంటేనే కానీ, మిమ్మల్ని ఇక్కడ్నించి కదల్నివ్వను. ఆరోజు మీరు చెప్పింది అక్షరాలా నిజం సార్! ఉద్యోగం, ఉద్యోగ ధర్మం అంటే నాకిప్పుడు అర్థం అవుతోంది సార్! మా ముందే ట్రాఫిక్ రూల్స్‌ని ఉల్లంఘించి, చేయకూడని పనులు చేస్తూ మేము చూస్తున్నాం అని కూడా ఖాతరు చేయక ఎంతోమంది ఎన్నో విధాల మమ్మల్ని వేధిస్తుంటారు. అటువంటప్పుడు నాకు మీరు జ్ఞాపకం వస్తారు సార్! ఎన్నో దొంగతనాల్ని, దొంగల్ని పట్టు

కున్నాను. జైల్లో పెట్టించాను. ఎంతోమందికి నేనంటే కసి. కారణం- వాళ్ళ వాళ్ళ విషయాలలో నేను అన్యాయం చేసానని! అప్పుడు గుర్తుకొస్తుంది. మీకు నేను చేసిన అవమానం. మీమీద నేను ఎలా తిరగబడ్డానో అలాగే నామీద వాళ్ళు తిరగబడి ఉంటే నా పని ఏమయ్యేది? నా ఉద్యోగ ధర్మం నన్ను బలవంతుడ్ని చేస్తోంది. అదే శ్రీరామరక్ష. కర్తవ్య నిర్వహణలో ఉన్న ఆనందం మరి దేంట్లో లేదు. మీరు ఆరోజు చెప్పిందే నిజం! మీ మీద ఆరోజు నేను చేసిన దౌర్జన్యానికి సిగ్గు పడుతున్నాను." భూపతి కంటిలో నీరు తిరుగుతోంది.

"నన్ను క్షమిస్తారా సార్?" నా చేతుల్ని పట్టుకున్నాడు.

"భూపతీ! నిజంగా ఈ రోజు నా జీవితంలో మరుపురానిది. నువ్వు కూడా కర్తవ్య బంధితుడి వయ్యావు. నాకదే చాలు!" నాకళ్ళు చెమ్మగిల్లాయి. *

## రచయితలకు మనవి

'విజయ'లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు-ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరు వారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ'లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్,

'విజయ'

80-ధనలక్ష్మి కాలనీ,

మద్రాసు-600 026.